# భారత్‌లో సహజీవన సంసారాలు పెరుగుతున్నాయా !

నేటి భారత యువతలో కూడా సహజీవన సంస్కృతి పెరుగుతున్నట్లు, యువతలో దాని పట్ల సానుకూల భావాలు చిగురిస్తున్నట్లు తెలుస్తున్నది. సహజీవన విధానం భారత్‌లో చట్ట వ్యతిరేకం కానప్పటికీ, సామాజిక అంగీకారం లేకపోవడం, సహజీవన పద్ధతిని దురాచారంగా కూడా పరగణించడం జరుగుతుంది. భారత్‌లో సహజీవనం చేస్తున్న జంటను చులకనగా చూడడం, వివక్ష చూపడం, సామాజిక వ్యతిరేకతను ఎదుర్కోవడం కొనసాగుతోంది. భారతంలో మూడు ముళ్లు పడక ముందే 18 ఏళ్లు పైబడిన జంట అంగీకారంతో సహజీవన సంసారాలకు సంబంధించిన నిర్దిష్టమైన చట్టాలు కూడా లేకపోవడం విశేషం. 'ఏక పత్ని వ్రతం'తో పాటు 'ఏక పతి వ్రతం' పునాదుల మీద పెరిగిన భారతీయ పౌర సమాజం సహజీవన సంసారాలను తీవ్రంగా వ్యతిరేకించడం చూస్తున్నాం. ఆధునిక డిజిటల్ యుగపు భారత యువతలో రోజు రోజుకు, ముఖ్యంగా మహానగరాల్లో సహజీవన సంసారాలు పెరుగుతున్నాయని, సగానికి పైగా యువత వీటిని అంగీరిస్తున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లోని ముంబాయి మహానగరం సహజీవన సంసారాలకు కేంద్రంగా నిలుస్తున్నది. సహజీవనానికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదా అనుమతులు అవసరం లేదని, విడిపోవు సందర్భాల్లో విడాకులు తీసుకోవడం లాంటి ప్రస్తావన ఉండదని తెలుసుకోవాలి. సహజీవనం చేసిన యువ జంటలు అధిక శాతం వరకు వివాహాలు కూడా చేసుకున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారత మహానగరాల్లో 50 శాతం వరకు యువత సహజీవన బాటన నడుస్తున్నారని తెలుస్తున్నది.

**సహజీవన సంసారాలు పెరుగులకు కారణాలు:**

విరాట్ కోహ్లీ-అనుష్క శర్మ, అమీర్ ఖాన్-కిరణ్ రావ్, సైఫ్ అలీ ఖాన్-కరీనా కపూర్, జాన్ అబ్రహమ్-బిపాసా బసు, బోను కపూర్-శ్రీదేవి లాంటి పలువురు బాలీవుడ్ జంటలు సహజీవనం చేసిన తర్వాతనే వివాహం చేసుకున్నారని మనకు తెలుసు. దినదినం సహజీవన సంబంధాలు పెరగడం, నేటి పౌర సమాజం కూడా నెమ్మదిగానైనా వాటిని అంగీకరించడం జరుగుతున్నది. నేటి డిజిటల్ యువత పెళ్లికి ముందే సహజీవన సంసారాలకు మొగ్గు చూపడానికి ప్రధాన కారణాలుగా వారి మధ్య అభిరుచుల ఏకీకరణ స్పష్టత, ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతనే వివాహం చేసుకోవడానికి నిర్ణయం తీసుకోవడం, ఇద్దరి మనోభావాలను అర్థం చేసుకోవడం, ఆర్థిక సమస్యలను అధిగమించడం, భావోద్వేగ సమతుల్యతల సాధన, గృహ సంబంధ పనులను పంచుకోవడం, పెళ్లి చేసుకోకుండానే శారీరక మానసిక అనుభవాలను స్వంతం చేసుకోవడం, వివాహం చేసుకోవడానికి ఇష్టపడని యువత సహజీవన పద్ధతులను ఆచరణలో పెట్టడం, పిల్లల్ని కనడం/పెంచడం భారం అనుకునే యువత, లైంగిక వాంఛలను మాత్రమే తీర్చుకోవడం, పెళ్లికి పూర్వం ఒకరినొకరు అర్థం చేసుకోవడం, ప్రేమతో సహజీవనం చేసి పెళ్లితో ముగింపు పలకడం లాంటి పలు అంశాలను పేర్కొనవచ్చు.

**సహజీవన సంసారాలు - చట్ట అంగీకారాలు:**

భారత రాజ్యాంగ ఆర్టికల్ 21 ప్రకారం పౌరులకు స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛ కూడా కల్పించబడిందని, దీని ప్రకారం సహజీవనం నేరంగా పరిగణించబడదని సుప్రీమ్ కోర్టు కూడా పేర్కొనడం విశేషం. అదే విధంగా 2005 గృహ హింస చట్టం ప్రకారం కూడా సహజీవన సంబంధాలను "గృహ సంబంధాలుగానే (డొమెస్టిక్ రిలేషన్‌షిప్)" చూడాలని నిర్ణయించింది. చట్ట పరిధిలో సహజీవనం చేసిన యువతి కూడా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో భరణం లేదా మెయిన్‌టెనెన్స్ పొందే హక్కు కూడా ఉంటుందని తెలుపుతున్నది. సహజీవనం చేసిన జంటకు జన్మించిన సంతానానికి ఆస్తి హక్కులు సంక్రమిస్తాయని తెలుస్తున్నది. సహజీవనం చేస్తున్న జంటను వారి తల్లితండ్రులు కూడా విడదీయలేరని చట్టం పేర్కొంటున్నది. సహజీవనం చేసిన జంటకు చట్టం ఎలాంటి రక్షణ కల్పించకపోవడంతో వివాహిత యువతులకు కల్పించిన చట్ట రక్షణలు వీరికి వర్తించవు. సహజీవన జంట మధ్య విభేదాలు వచ్చినపుడు వెంటనే వారు విడిపోయి తమ తమ జీవితాలను కొనసాగించే వెసులుబాటు మాత్రం ఉన్నది. దీర్ఘకాలం పాటు సహజీవనం చేయడం, పౌర సమాజంలో ఆ జంట కలిసి తిరగడం, ఇద్దరికీ 18 ఏండ్లకు పైగా వయస్సు ఉండడం, పెళ్లి అయిన జంట వలె లైంగిక సంబంధాలను కలిగి ఉండడం, ఇద్దరి ఆదాయాలను కలిపి ఖర్చు చేయడం, గృహ సంబంధ పనుల్లో పరస్పరం సహాయం చేసుకోవడం, ఇద్దరు తమ హక్కులు బాధ్యతలను పంచుకోవడం, సంతానాన్ని కనడం లాంటి ప్రత్యేక సందర్భాల్లో సహజీవనాన్ని కూడా వివాహం జరిగినట్లుగానే భావించాలని పేర్కొనడం జరుగుతోంది.

**సహజీవనం, డేటింగ్ సంస్కృతులు ఒకటేనా!**

18 ఏండ్లు దాటిన ఒక యువతి, ఒక యువకుడు పెళ్లికి ముందు ఒక అంగీకారానికి వచ్చి ఒకే ఇంట్లో కలిసి జీవించడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి దీర్ఘకాలం పాటు జంటగా జీవించడాన్ని 'సహజీవనం లేదా లివ్-ఇన్ రిలేషన్‌షిప్' అని పిలుస్తాం. సహజీవనంలో ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకొని ఇష్టపడిన తర్వాత పెళ్లి కూడా చేసుకోవడం జరుగుతుంది లేదా ఇద్దరి అలవాట్లు/అభిరుచులు/ఆచారాలు/జీవనశైలి/ఆలోచనలు కలువవని నిర్ణయించుకున్నపుడు ఆ సహజీవన జంట విడిపోయి స్వేచ్ఛగా బతకడానికి నిర్ణయించుకుంటారు. సహజీవన సంసారాల్లో యువ జంట లైంగిక సంబంధాలను కూడా కొనసాగించవచ్చు. డేటింగ్ అనే ఆచారం 1 - 3 మాసాల స్వల్పకాలం పాటు ఇద్దరు కలిసి తిరగడం, వేరు వేరు ఇండ్లల్లో జీవిస్తున్నప్పటికీ కలిసి తిరుగుతూ అన్ని రకాలుగా ఒకరినొకరు అర్థం చేసుకునే ప్రయత్నంగా భావించాలి. ఒక ఆహార పదార్థాన్ని ఎలా ఉందో రుచి చూసినట్లు, ఇద్దరి మధ్య సంబంధాన్ని కూడా డేటింగ్‌తో కొద్ది సమయంలోనే తెలుసుకోవడం జరుగుతుంది. డేటింగ్‌లో జంట లైంగిక సంబంధాలను తప్పనిసరిగా పెట్టుకోవాలనే నియమం లేకపోయినప్పటికీ అదే ప్రధాన అంశంగా కూడా తీసుకోబడుతున్నది. డేటింగ్ సంబంధాన్ని సీరియస్‌గా కూడా తీసుకోవలసిన పని లేదు. అది ఒక తేలికైన స్వల్పకాలిక సంబంధం కూడా అయి ఉండవచ్చు. ఇద్దరిలో ఒకరు యువతి, మరొకరు యువకుడు కావచ్చు లేదా ఒకే లింగానికి చెందిన జంట కూడా డేటింగ్ చేయవచ్చు. జంట ఒక మంచి స్నేహితులుగా కలిసి తిరగడాన్ని కూడా డేటింగ్‌గా భావించవచ్చు. డేటింగ్ చేసిన జంట కొంతకాలం తర్వాత సహజీవనం లేదా వివాహ మండపానికి కూడా దారి తీయవచ్చు.

ప్రేమ వివాహాలు అన్ని కొనసాగడం లేదని, పెద్దలు కుదుర్చు వివాహాలు కూడా విడాకుల వరకు వస్తున్నాయని గమనించి, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ, పెళ్లంటే ఒక జంట మాత్రమే ఒక్కటి కావడం కాదని, రెండు కుటుంబాల కలయికగా వివాహాన్ని చూస్తున్న పౌర సమాజంలో జీవిస్తున్నామని తెలుసుకుంటూ నేటి యువత పాశ్చాత్య పోకడలను గుడ్డిగా అనుకరించకుండా తమ జీవితాలకు పెళ్లితో చక్కటి శాంతియుత కుటుంబ నిర్మాణ పరిష్కారం ఇవ్వాలని కోరుకుందాం. ప్రేమించిన వ్యక్తిని నేరుగా వివాహం చేసుకోవడం ఉత్తమమని, సహజీవన సంసారం మాత్రం చక్కటి పరిష్కారం కాదని తెలుసుకుందాం. నేటి యువత సీతారాములను ఆదర్శ జంటగా తీసుకోవాలని, అందమైన జీవిత భాగస్వామికి అందరి సమక్షంలో మూడు ముళ్లు వేయాలని ఆశిద్దాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఢిల్లీలో రోహిణి ప్రాంతంలో అత్యాధునిక కేంద్రీయ ఆయుర్వేద పరిశోధన సంస్థకు శంకుస్థాపన చేయనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 6:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ జనవరి 5న మధ్యాహ్నం సుమారు 12 గంటల 15 నిమిషాల ప్రాంతంలో ఢిల్లీలో అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవంతోపాటు కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల విలువ రూ.12,000 కోట్లకు పైనే. ప్రధాని దాదాపు ఉదయం 11 గంటల 15 నిమిషాల వేళలో నమో భారత్ రైలులో సాహిబాబాద్ ఆర్ఆర్‌టీఎస్ స్టేషన్ నుంచి న్యూ అశోక్ నగర్ ఆర్ఆర్‌టీఎస్ స్టేషన్ వరకు ప్రయాణించనున్నారు.

ఢిల్లీ-ఘజియాబాద్-మేరఠ్ నమో భారత్ కారిడార్లో సాహిబాబాద్ నుంచి న్యూ అశోక్ నగర్ మధ్య 13 కి.మీ. మేర పొడవున ఉండే భాగాన్ని ప్రధాని ప్రారంభిస్తారు. నిర్మాణానికి దాదాపు రూ.4,600 కోట్లు ఖర్చయిన ఈ మార్గం ప్రాంతీయ సంధానాన్ని పెంచడంలో ఒక చెప్పుకోదగిన ఘట్టం కానుంది. దీనిని ప్రారంభించడంతో, ఢిల్లీకి మొదటిసారి నమో భారత్ సంధాన సదుపాయం (కనెక్టివిటీ) సమకూరనుంది. ఇది ఢిల్లీ, మేరఠ్‌ల మధ్య ప్రయాణించడాన్ని సులభతరంగా మార్చివేయడమే కాకుండా లక్షలాది ప్రజలకు అధిక వేగవంతమైన, సౌకర్యవంతమైన యాత్రానుభూతినీ, దాంతోపాటే సాటిలేని సురక్షనూ, విశ్వసనీయతనూ కూడా అందిస్తుంది.

ప్రధాని ఢిల్లీ మెట్రో నాలుగో దశలో భాగంగా జనక్‌పురి, కృష్ణ పార్క్‌ల మధ్య 2.8 కి.మీ. పొడవైన మార్గాన్ని కూడా ప్రారంభించనున్నారు. ఈ మార్గం నిర్మాణానికి దాదాపు రూ.1,200 కోట్లు ఖర్చు చేశారు. ఢిల్లీ మెట్రో నాలుగో దశలో ప్రారంభానికి నోచుకొంటున్న మొదటి మార్గం ఇదే కానుంది. దీంతో పశ్చిమ ఢిల్లీలో కృష్ణ పార్క్, వికాస్‌పురిలో కొన్ని ప్రాంతాలే కాక దీంతో ముడిపడ్డ ఇతర ప్రాంతాలకు కూడా ప్రయోజనం అందనుంది.

ఢిల్లీ మెట్రో నాలుగో దశలో భాగంగా రితాలా - కుండలీ సెక్షను నిర్మాణ పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. 26.5 కి.మీ. పొడవు ఉండే ఈ మార్గం నిర్మాణానికి ఇంచుమించు రూ. 6,230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ కారిడార్ ఢిల్లీలోని రితాలాను హర్యానాలోని నాథూపూర్ (కుండలీ)తో కలుపుతుంది. ఫలితంగా ఢిల్లీ, హర్యానాల్లోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో సంధాన సదుపాయాన్ని చాలావరకు మెరుగుపడనుంది. దీంతో రోహిణి, బవానా, నరేలా, ఇంకా కుండలీ వంటి ప్రధాన ప్రాంతాలు లాభపడతాయి. ఆ ప్రాంతాల్లోని నివాస, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలకు చేరుకోవడం మెరుగుపడుతుంది. రెడ్ లైనును విస్తరించినందువల్ల ఇది ఒకసారి పనిచేయడం మొదలైందంటే గనక, ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో ప్రయాణాలు చేయడం సౌకర్యవంతంగా మారిపోతుంది.

న్యూ ఢిల్లీలో రోహిణి ప్రాంతంలో కేంద్ర ఆయుర్వేద పరిశోధన సంస్థ (సెంట్రల్ ఆయుర్వేద రిసర్చ్ ఇనిస్టిట్యూట్..'సీఏఆర్ఐ')కి అత్యాధునిక భవనాన్ని సుమారు రూ.185 కోట్ల ఖర్చుతో నిర్మించడానికి సంబంధించిన పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్యాంపస్ ఆరోగ్య సంరక్షణ సేవలు, వైద్య చికిత్స సేవలకు అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానుంది. నూతన భవనంలో పరిపాలన బ్లాకు, ఓపీడీ బ్లాకు, ఐపీడీ బ్లాకులతోపాటు చికిత్సలకు మాత్రమే ప్రత్యేకంగా మరో బ్లాకును కూడా ఏర్పాటు చేయనున్నారు. వీటితో రోగులకు, పరిశోధకులకు ఒక ఏకీకృత, అంతరాయాలకు తావుండని ఆరోగ్య సంరక్షణ సేవల్ని అందించడం సాధ్యపడనుంది.

# అహ్మదాబాద్‌లో పుష్పాల అంతర్జాతీయ ప్రదర్శన దృశ్యాల్ని పంచుకొన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 6:అహ్మదాబాద్ లో పూల అంతర్జాతీయ ప్రదర్శన దృశ్యాల్ని కొన్నిటిని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకొన్నారు. 'ఈ ప్రదర్శనతో నాకు బలమైన అనుబంధం ఉంది, ఎందుకంటే ముఖ్యమంత్రిగా నేను సేవ చేసిన కాలంలోనే ఈ ప్రదర్శన వృద్ధి చెందింది. ఈ తరహా ప్రదర్శనలు ప్రకృతి శోభను ఒక ఉత్సవంలా చాటిచెప్పడంతోపాటు చైతన్యానికీ, నిలకడతనం కలిగిన మనుగడకూ ప్రేరణగా నిలుస్తాయ'ని కూడా శ్రీ మోదీ అన్నారు.

"అహ్మదాబాద్ లో పుష్పాల అంతర్జాతీయ ప్రదర్శనకు చెందిన కొన్ని దృశ్యాలు ఇవిగో, చూడండి. ఈ ప్రదర్శనతో నాకు బలమైన బంధం ఉంది, దీనికి కారణం ఏమిటంటే ముఖ్యమంత్రిగా నేను పనిచేసిన కాలంలోనే దీని వృద్ధిని నేను గమనించాను. ఇలాంటి ప్రదర్శనలు ప్రకృతి సౌందర్యాన్ని ఒక పండుగలా చేసుకోవడమే కాకుండా, భూమిపై మన మనుగడను మనం ఎలా స్థిరపరచుకోవచ్చో అనే విషయంలో ప్రేరణనిస్తాయి కూడా. ఈ ప్రదర్శనలు స్థానిక రైతులకూ, తోటల పెంపకందారులకూ, ఔత్సాహికులకూ వారి సృజనశీలతను చాటుకొనేందుకు ఓ వేదికను సైతం అందిస్తాయి."

# టీడీపీకి ఓటమి ఎరుగని కంచుకోట కుప్పం.. చంద్రబాబు

-ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
-ఇక్కడి ప్రజలకు అన్ని విధాల అండగా ఉంటా
-రాష్ట్రానికి ముఖ్యమంత్రినైనా..నేను మీ వాడినే
-మీ ఆదరణ, అభిమానమే నాలుగు సార్లు సిఎం చేసింది
-ఇక్కడి బిడ్డగా మీ రుణాన్ని తీర్చుకుంటా
-'స్వర్ణ కుప్పం- విజన్ 2029' డాక్యుమెంట్ ను విడుదల చేసిన చంద్రబాబు




తిరుపతి, జనవరి 6:తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రి నైనా.. అ స్థాయికి చేర్చింది మీరేనంటూ కుప్పం ప్రజలకు సిఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.. నాలుగుసార్లు ముఖ్యమంత్రి చేసిన అభిమానం, ఆదరణ మీదే నంటూ ప్రశంసలు కురిపించారు. కుప్పంలో ఒక్కసారి కూడా ఓడిపోలేదని, పసుపు జెండాకు పెట్టని కోట అని అన్నారు. రెండు రోజుల పాటు పర్యటన కోసం నేటి ఉదయం కుప్పం చేరుకున్న చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ద్రవిడ యూనివర్సిటీలో 'స్వర్ణ కుప్పం- విజన్ 2029' డాక్యుమెంట్ ఆవిష్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ వైసిపి హయాంలో రాష్ట్రం వెనుకబడిందని.. అప్పుల కుప్పగా స్టేట్ మారిందన్నారు. కష్టపడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. హైదరాబాద్ లో నాడు తాను చేసిన అభివృద్ధి ఫలాలే ఇప్పుడు వస్తున్నాయని చెప్పారు. 2014-19 మధ్య ఏపీని అభివృద్ధి పథంలో నడిపించామని చెప్పారు.. ప్రతి ఇంటికీ పారిశ్రామికవేత్త ఉండాలనేది తన విజన్ అని చెప్పారు.

తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ "రాబోయే రోజుల్లో కుప్పంను ఎలా అభివృద్ధి చేస్తామో ప్రణాళికలు రచించాం. ఏటా ఎలాంటి పనులు చేపట్టాలనేదానిపై ఆలోచన చేశాం. కుప్పానికి పెట్టుబడులు తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తాం. జీవితం ఎవరికీ జాక్పాట్ కాదు. ఒకసారి అవకాశం వస్తుంది.. దాన్ని సద్వినియోగం చేసుకోకపోతే। వైకుంతపాళి తరహా పరిస్థితే ఎదురవుతుంది. రాజకీయం, వ్యాపారం సహా అన్ని రంగాలకూ ఇది వర్తిస్తుంది. ఈసారి నియోజకవర్గాల వారీగా విజన్ తయారు చేస్తున్నాం. ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఆకాంక్షలను ఎప్పటికప్పుడు నెరవేర్చగలిగితే.. అలాంటి నేతలు శాశ్వతంగా ఎమ్మెల్యేలుగా ఉంటారు.

టిడిపి ఆవిర్భావం తర్వాత కుప్పంలో తెదేపా తప్ప వేరే పార్టీ జెండా ఎగరలేదు. పోటీ చేసిన అన్ని సార్లూ ప్రజలు గెలిపించారు. కుప్పం ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ధన్యవాదాలు. విజన్ డాక్యుమెంట్ విషయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రతి ఇంటిలోనూ దీనిపై చర్చ జరగాలి. ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇవ్వాలనే ఆలోచన యువతలో ఉండాలి" అని చంద్రబాబు అన్నారు.

చంద్రబాబు ఘన స్వాగతం ..

రెండు రోజుల పర్యటన కోసం గుడుపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ఇందిరా గాంధీ స్టేడియంకు హెలికాప్టర్ లో చంద్రబాబు చేరుకున్నారు. అక్కడ హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీకాంత్,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, అనంత పురం రేయింజ్ డి ఐ జి.షి మోషీ, ఎస్పీ మణికంత చెందొలు,జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, కడ పీడీ వికాస్ మర్మత్,డి ఎఫ్ ఓ.భరణి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు.

# మూడు నెలల్లో టీసీఎస్ ఇన్నోవేషన్ హబ్.. నారా లోకేష్

-పది వేల మందికి ఉపాధి ప్రకటించిన నారా లోకేష్
-పెదఅయినం గ్రామంలో రతన్ టాటా విగ్రహం ఆవిష్కరణ
-రతన్ చేసిన సేవలను స్మరించుకున్న మంత్రి
-విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని పిలుపు

అమరావతి, జనవరి 6: మూడు నెలల్లో టీసీఎస్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏపీలో తీసుకురాబోతున్నామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. పదివేల మందికి ఉపాధి కల్పించబోతున్నామని




చెప్పారు. ప్రపంచానికి టాటా బ్రాండ్‌ను పరిచయం చేసిన వ్యక్తి రతన్ టాటా అన్నారు. విలువలతో కూడిన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని తెలిపారు. భీమవరం పర్యటనకు వచ్చిన ఆయన పెదఅయినంలో రతన్‌టాటా కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశీయ ఉత్పత్తులు, బ్రాండ్ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్న వ్యక్తి రతన్ టాటా అని ప్రశంసించారు. హైదరాబాద్‌లో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.25 కోట్లు, హుద్ హుద్ తుపాను సమయంలో మూడు కోట్లు విరాళం ఇచ్చిన వ్యక్తి రతన్ టాటా అని గుర్తుచేశారు.

ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు ఫైర్ బ్యాండ్ అని మంత్రి నారా లోకేష్ ప్రశంసల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఉండి నియోజకవర్గ అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. విద్యార్థులను చూస్తుంటే తన కాలేజ్ రోజులు గుర్తుకు వస్తున్నాయని చెప్పారు. తాను కష్టకాలంలో ఉన్నప్పుడు తనకు తోడుగా ఉన్నది తన మిత్రులు, బంధువులు అనే చెప్పారు. టీడీపీకి ఉండి నియోజకవర్గం కంచుకోట అన్నారు. ఆర్ఆర్ఆర్ అంటే రియల్, రెస్పాన్సిబుల్ అండ్ రెబల్ అని కొనియాడారు. ఏ పోలీసులయితే ఆయనను కొట్టారో వారికి సొంత నిధులతో వాహనాలు కొనిచ్చారని చెప్పారు.

ఏపీ చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని, ప్రతీనెల రూ. 4 వేల కోట్లతో ప్రభుత్వం నడుస్తుందని చెప్పారు. ఈ సంక్షోభాన్ని విద్యార్థులు ఒక అవకాశంగా మలుచుకోవాలని చెప్పారు. విద్యాశాఖ చాలా కష్టమైన శాఖ అని తెలిపారు. కష్టమైన శాఖలను ఎంచుకోవడం తనకు ఇష్టమన్నారు. కష్టకాలంలో మనతో నిలబడిన వారితో కలిసి వెళ్లాలని చెప్పారు. కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యాంశాలను మార్చాలని భావిస్తున్నామని అన్నారు. పాఠ్య పుస్తకాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు లేవు అని చెప్పారు. పార్టీల రంగులు లేవు, తమకు ఆ పిచ్చి లేదని అన్నారు. డ్రగ్స్ వద్దు క్యాంపెయిన్ రూపొందించామని తెలిపారు. విద్యార్థులు అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వద్దు బ్రో అంటూ మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

# కృత్రిమ మేధ రంగంలో నాయకత్వం వహించడానికి భారత్ కంకణం కట్టుకొంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జనవరి 6:భారతదేశ జెట్టాహాక్ పారిశ్రామికవేత్తల్లో ఒకరైన శ్రీ విశాల్ సిక్కా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని కలుసుకొన్నారు. ఈ సమావేశం చక్కని ఆలోచనల్ని ఒకరికొకరు తెలియజెప్పుకోవడానికి వేదికైందంటూ శ్రీ మోదీ అభివర్ణించారు. కృత్రిమ మేధ (ఆల్టర్నేటివ్ ఇంటెలిజెన్స్.. ఏఐ) రంగంలో నాయకత్వ పాత్రను పోషించడానికి భారత్ కట్టుబడి ఉందనీ, ఈ క్రమంలో నవకల్పన (ఇన్నొవేషన్)పైనా, యువతకు అవకాశాలను అందించడంపైనా దృష్టిని కేంద్రీకరిస్తోందనీ ఆయన అన్నారు. ఏఐని గురించీ, భారత్‌పై ఏఐ చూపే ప్రభావాన్ని గురించీ, రాబోయే కాలంలో చేపట్టాల్సిన పనులను గురించీ ఇరువురూ విస్తృతంగా చర్చించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శ్రీ విశాల్ సిక్కా నమోదు చేసిన ఒక సందేశానికి ప్రధాని సమాధానాన్నిస్తూ మరో సందేశంలో ఇలా పేర్కొన్నారు:

"ఇది నిజానికి సిసలైన చర్చే. నవకల్పనపైనా, యువతీయువకులకు అవకాశాలను అందించడంపైనా శ్రద్ధ తీసుకొంటూ, ఏఐ రంగంలో అగ్రగామిగా నిలవాలని భారత్ కంకణం కట్టుకొంది."

# నాసెంట్ గెలాక్సీ ఎన్‌జిసి 3785 గెలాక్సీ యొక్క పొడవైన టైడల్ టెయిల్ చివరిలో ఏర్పడటంలో కనుగొనబడింది

న్యూఢిల్లీ, జనవరి 6:భూమి నుండి 430 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో, సింహ రాశిలో, గెలాక్సీ ఎన్‌జిసి 3785 యొక్క పొడవైన, సన్నని నక్షత్రాలు మరియు నక్షత్ర వాయువుల యొక్క పొడవైన, సన్నని ప్రవాహం టైడల్ టెయిల్ చివరిలో ఒక కొత్త అల్ట్రా-డిఫ్యూజ్ గెలాక్సీ ఏర్పడినట్లు కనుగొనబడింది. గెలాక్సీ నిర్మాణం యొక్క ఆవిష్కరణ, బహుశా ఎన్‌జిసి 3785 మరియు పొరుగున ఉన్న గురుత్వాకర్షణ పరస్పర చర్య ద్వారా నడపబడుతుంది గెలాక్సీ. గెలాక్సీ పరిణామాన్ని అర్థం చేసుకోవడంలో ప్రధాన మైలురాయిని సూచిస్తుంది.

ఎన్‌జిసి 3785 గెలాక్సీ ఇప్పటి వరకు కనుగొనబడిన పొడవైన టైడల్ తోకను కలిగి ఉన్నట్లు తెలిసింది. తోక గెలాక్సీ నుండి విస్తరించి ఉంది మరియు రెండు గెలాక్సీలు సన్నిహితంగా సంకర్షణ చెందుతున్నప్పుడు గురుత్వాకర్షణ శక్తుల ("టైడల్ ఫోర్స్") కారణంగా ఏర్పడుతుంది, ముఖ్యంగా సన్నిహిత ఎన్‌కౌంటర్ లేదా విలీన ప్రక్రియలో ఒకదానికొకటి దూరంగా పదార్థాన్ని లాగుతుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన స్వయంప్రతిపత్త సంస్థ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఎ) నుండి ఖగోళ శాస్త్రవేత్తలు మరియు వారి సహకారులు గెలాక్సీ ఎన్‌జిసి 3785ని జాగ్రత్తగా పరిశీలించినప్పుడు, ఇప్పటివరకు కనుగొనబడిన అతి పొడవైన టైడల్ టెయిల్‌ను కలిగి ఉందని వారు కనుగొన్నారు. ఈ టైడల్ టెయిల్ చివరిలో కూడా ఒక అల్ట్రా- డిఫ్యూజ్ గెలాక్సీ ప్రస్తుతం ఏర్పడుతోంది.

# దేశంలోని ప్రతి మూలలో రైల్వే కనెక్టివిటీ మరియు ఉద్యోగాల సృష్టికి, పరిశ్రమలకు మద్దతు ఇవ్వడానికి రైల్వేలు: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 6:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈరోజు వివిధ రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవం మరియు శంకుస్థాపన చేశారు. కొత్త జమ్మూ రైల్వే డివిజన్‌ను ప్రధాని ప్రారంభించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన చేసి తెలంగాణలోని చర్లపల్లి న్యూ టెర్మినల్ స్టేషన్‌ను కూడా ఆయన ప్రారంభించారు.

శ్రీ గురు గోవింద్ సింగ్‌జీ జయంతి సందర్భంగా తన శుభాకాంక్షలను తెలియజేస్తూ, ఆయన బోధనలు మరియు జీవితం బలమైన మరియు సంపన్నమైన దేశం యొక్క దృక్పథాన్ని ప్రేరేపిస్తుందని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. కనెక్టివిటీలో భారత్ వేగవంతమైన పురోగతిని ప్రశంసిస్తూ, 2025 ప్రారంభం నుండి, భారత దేశం తన మెట్రో రైల్ నెట్‌వర్క్‌ను 1000 కిలోమీటర్లకు పైగా విస్తరించడం ద్వారా తన కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని శ్రీ మోదీ పేర్కొన్నారు. నిన్న ఢిల్లీ మెట్రో ప్రాజెక్టుల ప్రారంభంతో పాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల నమో భారత్ రైలు ప్రారంభోత్సవాన్ని ఆయన ప్రస్తావించారు. జమ్మూ కాశ్మీర్, ఒడిశా మరియు తెలంగాణలలో ప్రారంభించిన ప్రాజెక్టులు ఉత్తర, తూర్పు ప్రాంతాలకు ఆధునిక అనుసంధానం లో ఒక పెద్ద ఎత్తుకు దూసుకుపోతున్నందున, దేశం మొత్తం కలిసికట్టుగా, అంచెలంచెలుగా ముందుకు సాగుతోందనడానికి నేటి కార్యక్రమం మరింత నిదర్శనమని శ్రీ మోదీ పేర్కొన్నారు. మరియు దేశంలోని దక్షిణ ప్రాంతాలు. 'సబ్కా సాథ్, సబ్‌కా వికాస్' అనే మంత్రం అభివృద్ధి చెందిన భారత దేశం యొక్క దృక్పథాన్ని వాస్తవంగా మార్చడంలో సహాయపడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ పరిణామాలపై ఈ రాష్ట్రాల ప్రజలకు, భారత పౌరులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ వంటి ఆధునిక రైలు నెట్‌వర్క్‌ల పనులు దేశంలో వేగంగా సాగుతున్నాయని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ఈ ప్రత్యేక కారిడార్‌లు సాధారణ ట్రాక్‌లపై ఒత్తిడిని తగ్గిస్తాయి మరియు హై-స్పీడ్ రైళ్లకు మరిన్ని అవకాశాలను కూడా సృష్టిస్తాయని ఆయన అన్నారు. మేడ్ ఇన్ ఇండియా ప్రచారంతో రైల్వేలు పరివర్తన చెందుతోందని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

మెట్రోలు, రైల్వేల కోసం ఆధునిక కోచ్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. స్టేషన్‌లను కూడా రీడెవలప్ చేస్తున్నారు, స్టేషన్‌లలో సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేస్తున్నారు మరియు రైల్వే స్టేషన్‌లలో 'ఒక స్టేషన్, ఒక ఉత్పత్తి' స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమా లన్నీ రైల్వే రంగంలో లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నాయి. "గత దశాబ్దంలో లక్షలాది మంది యువకులు రైల్వేలో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలను పొందారు. కొత్త రైలు కోచ్‌లను ఉత్పత్తి చేసే కర్మాగారాల్లో ముడి పదార్థాల డిమాండ్ ఇతర రంగాలలో కూడా మరిన్ని ఉద్యోగ అవకాశాలకు దారి తీస్తుంది" అని శ్రీ మోదీ తెలిపారు.

